అర్జీల సత్వర పరిష్కారానికి కృషి

రాజేంద్రనగర్: అర్జీల సత్వర పరిష్కారానికి కృషి చేస్తున్నామని రాజేంద్రనగర్ సర్కిల్ జీహెచ్ఎంసీ ఉప కమిషనర్ రవి కుమార్ అన్నారు. జీహెచ్ఎంసీ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో కలిసి సోమవారం ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన స్వయంగా అర్జీలు స్వీకరించి సంబంధిత అధికారులకు అందజేసి మాట్లాడారు. వచ్చిన ప్రతి ఫిర్యాదుపై తగు చర్యలు చేపట్టి పరిష్కరిస్తున్నట్లు తెలిపారు. నిధులతో సంబంధం ఉన్న అభివృద్ధి కార్యక్రమాలను ప్రాధాన్యత వారీగా చేపడుతున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

సీపీ అవినాష్ మహంతిని కలిసిన 'ఎస్కీ' బృందం

రాయదుర్గం: సైబరాబాద్ సీపీ అవినాష్ మహంతిని గచ్చిబౌలిలోని ఇంజినీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా అధికారుల బృందం సోమవారం కలిసింది. ఎస్కీ డైరెక్టర్ డాక్టర్ జి రామేశ్వరరావు, అధికారుల బృందం మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు. ఈ సందర్భంగా ఎస్కీ పనితీరు, నిర్వహించే కోర్సులు, శిక్షణా కార్యక్రమాలను ఆయనకు వివరించారు. తాజాగా సైబర్ సెక్యూరిటీ, రోడ్ సేఫ్టీ, ట్రాఫిక్ నియంత్రణ తదితర అంశాలపై ఎస్కీ శిక్షణా కార్యక్రమాలకు ముఖ్యఅతిథిగా హాజరు కావాలని కోరగా సీపీ అంగీకరించారని తెలిపారు.

నేటి నుంచి బ్రహ్మోత్సవాలు

రాయదుర్గం: రాయదుర్గంలోని లక్ష్మణ్‌బాగ్‌లో వేంకటేశ్వరస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు మంగళవారం 20వ తేదీ నుంచి 25వ తేదీ వరకు జరుగుతాయి. 22వ తేదీ కల్యాణోత్సవం, 24వ తేదీన రథోత్సవం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఆలయంలో నిత్యం అర్చనలు, అష్టోత్తర పూజలు, అభిషేకాలు, సామూహిక పారాయణాలు జరగనున్నాయి.

ప్రజావాణి

శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి సర్కిల్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 7 ఫిర్యాదులు అందినట్లు అధికారులు తెలిపారు. టౌన్ ప్లానింగ్‌కు నాలుగు, రెవెన్యూ సెక్షన్‌కు రెండు, యూసీడీ సెక్షన్‌కు ఒక దరఖాస్తు వచ్చినట్లు తెలిపారు. ఈ సమావేశంలో ఈఈ శ్రీనివాస్, ఏసీపీ మెహ్రా, ఏఎంసీ నరేందర్‌రెడ్డి, ప్రాజెక్టు ఆఫీసర్ మల్లీశ్వరి పాల్గొన్నారు.



మైలార్‌దేవ్‌పల్లిలో ఛత్రపతి శివాజీకి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్



బృందావన్ కాలనీలో కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి

ఘనంగా ఛత్రపతి శివాజీ జయంతి

నివాళులర్పించిన ఎమ్మెల్యే, కార్పొరేటర్లు, నాయకులు, సభ్యులు

మైలార్‌దేవ్‌పల్లి : మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ పరిధిలోని శివాజీ చౌరస్తా, బృందావన్ కాలనీల్లో ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతిని సోమవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్, డివిజన్ బీజేపీ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి శివాజీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. కోట్లాది మంది భారతీయులకు స్ఫూర్తి ప్రదాత , మరాఠా సామ్రాజ్యాన్ని నెలకొల్పి, మొగల్ సామ్రాజ్యాన్ని ఎదురించిన గొప్ప వీరుడు శివాజీ మహారాజ్ అని కొనియాడారు. స్త్రీలను గౌరవించి హిందూ ధర్మానికి వన్నె తెచ్చిన వీరుడు అని గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో ప్రేమ్‌గౌడ్ , దయానంద్ సతీశ్, దుర్గాప్రసాద్, రావుల భాస్కర్, యాదగిరి, ఆంజనేయులు, రమేశ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అత్తాపూర్: అత్తాపూర్‌లో శివాజీ మహారాజ్ భారీ విగ్రహంతో ప్రజలు ఊరేగింపు నిర్వహించారు. కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ నాయకులు గురుభాయ్, రమేశ్, సిద్ధు, జనార్దన్ రెడ్డి, నాగేందర్ రెడ్డి, ప్రవీణ్ రెడ్డి పాల్గొన్నారు.

మణికొండ, నార్సింగి మున్సిపాలిటీల పరిధిలో..

మణికొండ: నార్సింగి మున్సిపాలిటీ పరిధిలోని ఖానాపూర్, మంచిరేవుల, వట్టినాగుపల్లి, గొలిదొడ్డి తదితర గ్రామాల్లో శివాజీ మహారాజ్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం బైక్, కారు ర్యాలీలు నిర్వహించారు. అలాగే మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని పుప్పాలగూడ, అలకాపూర్ టౌన్‌షిప్, మణికొండ మర్రిచెట్టు కూడళ్లలోనూ ఆయన చిత్రపటాలను ఏర్పాటు చేసి నివాళులర్పించారు. సాయంత్రం పెద్ద ఎత్తున బైక్, కార్లతో ర్యాలీ తీశారు. ఆయా కార్యక్రమాల్లో మాజీ ఎంపీపీ తలారి మల్లేశ్, ఖానాపూర్ కౌన్సిలర్ జి.అమరేందర్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ టి. కృష్ణ, బీజేపీ ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు డి.లక్ష్మినారాయణ, ఆలయాల కమిటీ అధ్యక్షుడు వెంకటేశ్‌యాదవ్, పుప్పాలగూడలో కె.రవీందర్, జి.నరేందర్, మహేందర్‌గౌడ్, చిన్న, మోహన్‌సింగ్, మహేందర్, సదానంద్, కిరణ్, రాజు, వినయ్, యువజన సంఘాల నాయకులు, సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

భారీ ర్యాలీ..

అత్తాపూర్: రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్ అత్తాపూర్ రామ్ దేవాలయం నుంచి యువకులంతా కలిసి భారీ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బీఆర్ఎస్ యువ నాయకుడు పట్లోళ్ల కార్తీక్ రెడ్డి పాల్గొన్నారు. ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతిని ఘనంగా నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు.



భారీ ర్యాలీలో పాల్గొన్న నాయకులు, ప్రజలు



పుప్పాలగూడలో నాయకులు, యువకులు..



నివాళులర్పిస్తున్న బాబుల్‌రెడ్డి నగర్ యూత్ సభ్యులు



భారీ ర్యాలీలో పాల్గొన్న బీఆర్ఎస్ యువ నాయకుడు కార్తీక్ రెడ్డి



ఖానాపూర్‌లో నివాళులర్పిస్తున్న నాయకులు

గోవాకు 'మణికొండ' రాజకీయం

ఆదివారం తరలివెళ్లిన మున్సిపల్ చైర్మన్, కౌన్సిలర్లు

మణికొండ: మణికొండ మున్సిపాలిటీ రాజకీయం గోవాకు చేరింది. అవిశ్వాసం పెట్టిన 10 మంది కౌన్సిలర్లు ఇప్పటికే గోవా క్యాంప్‌లో ఉండగా, తాజాగా వారితో పాటు మున్సిపల్ చైర్మన్ కె.నరేందర్‌ముదిరాజ్ సైతం తన ఏడుగురు కౌన్సిలర్లతో ఆదివారం గోవాకు వెళ్లారు. ఈ నెల 22వ తేదీన అవిశ్వాస తీర్మానంపై బలపరీక్ష ఉన్న విషయం తెలిసిందే. అప్పటి వరకు అందరూ అక్కడే ఉండాలని నిర్ణయించుకున్నట్టు సమాచారం. ఇక మున్సిపల్ వైస్ చైర్మన్ కె.నరేందర్‌రెడ్డి బీజేపీ జాతీయ పదాధికారుల సమావేశంలో పాల్గొనేందుకు ఢిల్లీకి వెళ్లారు. దీంతో మణికొండ మున్సిపాలిటీలో ఒక్క ప్రజాప్రతినిధి కూడా స్థానికంగా లేకపోవడపైం ప్రజలు చర్చించుకుంటున్నారు. ఇదిలా ఉండగా ఆదివారం రాత్రి రెండు వర్గాలు గోవాలోని ఓ రెస్టారెంట్‌లో ఎదురుపడినట్టు సమాచారం. స్థానికంగా అసెంబ్లీ ఎన్నికల కారణంగా ఐదు నెలల నుంచి ఎలాంటి అభివృద్ధి పనులకు తీర్మానాలు చేయలేదు. దీనికితోడూ మరికొద్ది రోజుల్లోనే ఎంపీ ఎన్నికల కోడ్ వచ్చే అవకాశం కూడా ఉండడంతో మరో 2 నెలల పాటు తీర్మానాలు చేసే అవకాశం లేకుండా పోతుంది. స్థానికంగా అనేక పనులు చేపట్టాల్సి ఉన్నా ..వాటిని పట్టించుకోకుండా వారి రాజకీయాల కోసం ప్రజాప్రతినిధులు బయట తిరగడం ఏంటని స్థానికులు మండి పడుతున్నారు.

కౌన్సిల్ దృష్టికి నియోజకవర్గ సమస్యలు



జీహెచ్ఎంసీ కౌన్సిల్ సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గాంధీ

గచ్చిబౌలి: మూడు నెలలుగా వీధి దీపాలు వెలగడం లేదు...శానిటేషన్, డ్రైనేజీ పనులు చేయకుండా వ్యవస్థలను నిర్వీర్యం చేశారని జీహెచ్ఎంసీ కౌన్సిల్ సమావేశంలో శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ గళంవిప్పారు. సోమవారం జీహెచ్ఎంసీ ప్రధాన కార్యలయంలో జరిగిన కౌన్సిల్ సమావేశంలో శేరిలింగంపల్లి నియోజకవర్గంలో నెలకొన్న సమస్యలను కౌన్సిల్ దృష్టికి తీసుకొచ్చారు. జోనల్ కమిషనర్లుగా ఐఏఎస్ అధికారులను నియమిస్తే సంతోషించామని, ఒక్క రూపాయి లేని వ్యవస్థను అప్పజెప్పడంతో నిధులు మంజూరు కావడం లేదన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం హయంలో నెలకు జోనల్‌కు రూ.8 కోట్ల నిధులు మంజూరయ్యేవని, కనీసం రూ.4 కోట్లు కూడా విడుదల చేయలేదని దుయ్యబట్టారు. ప్రజా సమస్యలను పరిష్కరించడం లేదని అసహనం వ్యక్తం చేశారు. చెరువుల కబ్జాలను అడ్డుకొని సుందరీకరణ పనులు చేపట్టాలని కోరారు.

అధ్యాపకులు నైపుణ్యాలను మెరుగుపర్చుకోవాలి

హెచ్‌సీయూ వీసీ ప్రొ.బీజేరావు

రాయదుర్గం: అధ్యాపకులు విద్యాబోధనలో ఎప్పటికప్పుడు తమ నైపుణ్యాలను మెరుగుపర్చుకోవాలని హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ బీజేరావు పేర్కొన్నారు. విద్యార్థులకు పూర్తిస్థాయిలో అర్థమయ్యేలా బోధించాలన్నారు. గచ్చిబౌలిలోని హెచ్‌సీయూలోని హెచ్‌ఆర్‌డీసీలో యూజీసీ–మాలవ్య మిషన్ టీచర్ ట్రైనింగ్ సెంటర్ (యూజీసీ–ఎంఎంటీటీసీ), టాటా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫండమెంటల్ రీసెర్చ్ (టీఐఎఫ్ఆర్), హోమీ బాబా సెంటర్ ఫర్ సైన్స్ ఎడ్యుకేషన్‌ల సహకారంతో ఫిజిక్స్ టీచర్ ఓరియంటేషన్ ప్రోగ్రామ్‌ను సోమవారం ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యను అభివృద్ధి చేయడానికి కొత్తకొత్త మార్పులకు అనుగుణంగా బోధనలో మార్పులు తీసుకురావాలనే తపనతో యూజీసీ ఇలాంటి కార్యక్రమాలను ఏర్పాటు చేస్తోందన్నారు. టీఐఎఫ్ఆర్ ప్రతినిధులు ప్రొఫెసర్ ఎం కృష్ణమూర్తి, డాక్టర్ శిరీష్ పఠారే, స్కూల్ ఆఫ్ ఫిజిక్స్ డీన్ ప్రొఫెసర్ కేజీ ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ జి మనోజ్ కుమార్, ఎంఎంటీటీసీ డైరెక్టర్ ప్రొఫెసర్ ప్రకాశ్‌బాబు ప్రసంగించారు.

పబ్లిక్‌గార్డెన్‌లో సుందరీకరణ పనులు చేపట్టాలి

నాంపల్లి: పబ్లిక్‌గార్డెన్ పరిరక్షణకు తక్షణమే చర్యలు చేపట్టాలని, పార్కును అన్ని విధాలుగా సుందరీకరించి వాకర్స్‌కు ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని వయోవృద్ధులు, పబ్లిక్ గార్డెన్ వాకర్స్ అసోసియేషన్ సభ్యులు సీఎం రేవంత్‌రెడ్డికి లేఖ రాయగా సోమవారం పబ్లిక్‌గార్డెన్‌లో టీపీసీసీ కార్యదర్శి మణిలాల్ షాకు అందజేశారు. ఈ సందర్భంగా పర్యావరణ వేత్త, సామాజిక కార్యకర్త అబిద్ అలీ మాట్లాడుతూ.. పార్కులో పోకిరీల బెడద ఎక్కువైందన్నారు. వాకర్స్‌కు సరైన మౌలిక వసతులు లేకుండా పోయాయని ఫిర్యాదులో పేర్కొన్నట్లు వివరించారు. పార్కును సుందరంగా తీర్చిదిద్ది సందర్శకులకు, వాకర్స్‌కు ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించే విధంగా అభివృద్ధి పనులు చేపట్టాలని లేఖలో కోరినట్లు తెలిపారు. పార్కులోనికి ప్రైవేట్ పాఠశాలల బస్సుల ప్రవేశం లేకుండా చూడాలని, పార్కును ప్రైవేట్ బస్సుల పార్కింగ్ స్థలంగా మార్చేశారని, ఈ విషయమై ఉద్యానవన శాఖ అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని పేర్కొన్నారు. పార్కులో ప్రైవేట్ బస్సుల పార్కింగ్‌కు అనుమతి ఇచ్చిన ఉద్యానవన శాఖ అధికారులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, చారిత్రాత్మకమైన వైఎస్సార్ స్టేట్ మ్యూజియం కాలుష్యం కాటుకు గురికాకుండా చూడాలని విజ్ఞప్తి చేసినట్లు అబిద్ అలీ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో తవక్కల్ గ్రూపు అధినేత సర్వర్ పాషా, జాకబ్, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

నాంపల్లిలో జీహెచ్ఎంసీ కమిషనర్ పర్యటన

నాంపల్లి: జీహెచ్ఎంసీ కమిషనర్ రొనాల్డ్ రాస్ నాంపల్లి నియోజకవర్గంలో సోమవారం ఉదయం ఆకస్మిక పర్యటన చేశారు. నాంపల్లి ఎమ్మెల్యే మహ్మద్ మాజీద్ హుస్సేన్‌తో కలిసి ఆయన పలు ప్రాంతాల్లో కలియతిరిగారు. ఇటీవల పారిశుధ్య నిర్వహణ లోపంపై కమిషనర్‌కు అనేక ఫిర్యాదులు అందాయి. ఈ నేపథ్యంలో కమిషనర్ ఎవరికి సమాచారం ఇవ్వకుండానే నియోజకవర్గంలోని పలు డివిజన్లను సందర్శించారు. ఆయా డివిజన్లలో గుట్టలుగా చెత్తపేరుకుపోవడం చూసి కమిషనర్ అవాక్కయ్యారు. చెత్త తరలింపులో జరుగుతున్న జాప్యంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. సకాలంలో పనులు చేపట్టకపోతే కఠిన చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని హెచ్చరించారు.

ప్రతిఒక్కరూ నిబంధనలు పాటించాలి

గోల్కొండ: వ్యాపారులతో పాటు సాధారణ పౌరులు సైతం నిబంధనలను పాటించాల్సిందేనని సౌత్ వెస్ట్ జోన్ డీసీపీ ఉదయ్‌కుమార్‌రెడ్డి అన్నారు. సోమవారం గోల్కొండ, ఎండిలైన్స్ తదితర ప్రాంతాలకు చెందిన వారితో పాటు పీస్ అండ్ మైత్రి కమిటీ సభ్యులు మెహిదీపట్నంలోని డీసీపీ కార్యాలయంలో ఆయనను కలిశారు. ఈ సందర్భంగా పీస్ అండ్ మైత్రి కమిటీ సభ్యులు షానవాజ్‌ఖాన్ డీసీపీకి బొకే అందించి సౌత్ వెస్ట్ జోన్ డీసీపీగా నియమితులైనందుకు అభినందించారు. ఈ సందర్భంగా డీసీపీ మాట్లాడుతూ.. శాంతిభద్రతల పరిరక్షణ కోసమే పోలీసులు నిబంధనలు విధిస్తారని రాత్రి పూట స్థానిక ప్రజలకు ఇబ్బందులు కలగకూడదనే ఉద్దేశంతోనే రెస్టారెట్లు, షాపులు మూసి వేస్తున్నామన్నారు.

ఆసాన్ నిఖాహ్ కరపత్రం ఆవిష్కరణ

గోల్కొండ: ముస్లిం సమాజంలో పెళ్లిళ్లను ఆర్భాటంగా చేయడం ఆచారంగా మారిందని.. ఇది ముస్లిం మత గ్రంథాలకు విరుద్ధమని ఎమ్మెల్యే కౌసర్ మొహియుద్దీన్ అన్నారు. గోల్కొండ జోన్ సదర్‌ఖాజీ ఆలీముద్దీన్ రూపొందించిన ఆసాన్ నిఖాహ్ కరపత్రాన్ని సోమవారం ఆయన టోలీచౌకీలోని తన కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 'సులభతర పెళ్లి' అనే శీర్షికతో సదర్ ఖాజీ అలీముద్దీన్ ఎంతో ధైర్యంగా ఆసాన్ నిఖాహ్ పేరిట ప్రచారం నిర్వహించడానికి ముందుకు రావడం ఆయన వృత్తిధర్మంలోని నిజాయతీకి నిదర్శనమన్నారు. గోల్కొండ జోన్ సదర్ ఖాజీ ఆలీముద్దీన్ మాట్లాడుతూ.. ఖాజీగా తన పదవి కాలంలో ఎన్నో క్లిష్టతరమైన పెళ్లిళ్లను సులభం చేశానన్నారు. సులభంగా పెళ్లి అనే నినాదంతో తాను ప్రారంభిస్తున్న ఈ కార్యక్రమానికి అన్ని వర్గాల ప్రజలు మద్దతు ఇస్తారని తాను ఆశిస్తున్నానన్నారు. కార్యక్రమంలో నానల్‌నగర్ కార్పొరేటర్ మహ్మద్ నసీరుద్దీన్, సయ్యద్ జబ్బార్, హబీబ్ చావుష్, ఆలీమ్, మీర్జా ఎక్బాల్ అహ్మద్ తదితరులు ఉన్నారు.

ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలి



దుండగులు తొలగించిన చింత చెట్టు



కమిషనర్ శరత్‌చంద్రకు వినతిపత్రం అందజేస్తున్న యాదవ సంఘం సభ్యులు

బండ్లగూడ: బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ ప్రశాంత్‌నగర్ కాలనీలోని శ్రీ మల్లికార్జున ఆలయ స్థలాన్ని ఆక్రమించేందుకు యత్నిస్తున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని యాదవ సంఘం సభ్యులు శేఖర్‌బాబుయాదవ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు కార్పొరేషన్ కమిషనర్ శరత్‌చంద్రకు సోమవారం వినతపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆలయంలో ఉన్న నాగసర్పం, అమ్మవారి విగ్రహాలను గుర్తు తెలియని దుండగులు దొంగలించాలరి, అలాగే ఆవరణలోని చింత చెట్టును కూడా నరికి వేశారన్నారు. దేవాలయ భూమిని ఆక్రమించేందుకే ఈ పనులు చేస్తున్నారని పేర్కొన్నారు. ఇప్పటికే ఈ విషయమై పోలీసులు, అటవీ శాఖ అధికారులకు ఫిర్యాదు చేశామని తెలిపారు. కార్యక్రమంలో హనుమంత్, పాపయ్యయాదవ్, రమేశ్‌యాదవ్, వేణుయాదవ్, రాజుయాదవ్ పాల్గొన్నారు.

కోకాపేటలో మార్చి 3 నుంచి కరాటే పోటీలు



బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న కౌన్సిలర్ శివారెడ్డి

మణికొండ: నార్సింగి మున్సిపాలిటీ పరిధిలోని కోకాపేటలో సక్సెస్ షోటాకాన్ రాష్ట్రస్థాయి కరాటే చాంపియన్ షిప్ పోటీలు మార్చి 3వ తేదీ నుంచి జరగనున్నాయి. ఇందుకు సంబంధించిన బ్రోచర్‌ను కోకాపేట కౌన్సిలర్ జి.శివారెడ్డి సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నార్సింగి మున్సిపాలిటీ పరిధిలో ఎంతోమంది కరాటే క్రీడాకారులు ఉన్నారన్నారు. వారితో పాటు తరలివచ్చే క్రీడాకారులతో చాంపియన్ షిప్ పోటీలు ఇక్కడ ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. మూడు రోజుల పాటు పోటీలు నిర్వహించనున్నట్లు ఆసక్తి గల వారు సంప్రదించాలని చీఫ్ ఆర్గనైజర్, కోచ్ కె.రాజు సూచించారు. కార్యక్రమంలో నాయకులు విశ్వనాథ్, రమేశ్ పాల్గొన్నారు.

చేవెళ్ల ఎంపీ సీటు బీజేపీదే



మాట్లాడుతున్న మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

చేవెళ్ల మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

గచ్చిబౌలి: రానున్న పార్లమెంటు ఎన్నికలలో చేవెళ్ల ఎంపీ సీటు బీజేపీదేనని మాజీ పార్లమెంటు సభ్యుడు కొండా విశ్వేశ్వర్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. శేరిలింగంపల్లిలోని మసీదుబండలో బీజేపీ చేవెళ్ల పార్లమెంటు నియోజకవర్గం సన్నాహక సమావేశంలో సోమవారం ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి చిత్తశుద్ధితో కృషి చేస్తామన్నారు. బూత్ స్థాయి నుంచి నియోజకవర్గం స్థాయి వరకు నాయకులు, కార్యకర్తలు పార్టీ విజయానికి కృషి చేయాలని సూచించారు. పార్టీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు రవి కుమార్‌యాదవ్ మాట్లాడుతూ బీజేపీ గెలుపే లక్ష్యంగా అందరూ సమిష్టిగా పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. శేరిలింగంపల్లిలో మంచి మెజార్టీ సాధించేలా అందరూ కష్టపడాలన్నారు. కార్యక్రమంలో పార్టీ కన్వీనర్ రాఘవేందర్‌రావు, నాయకులు రవీందర్‌రావు, కసిరెడ్డి భాస్కర్‌రెడ్డి, నాగులుగౌడ్ రామరాజు, నవతారెడ్డి, బుచ్చిరెడ్డి, విజయలక్ష్మీ, కొండా విశ్వేశ్వర్‌రెడ్డి కుటుంబసభ్యులు, జిల్లా, డివిజన్, బూత్‌స్థాయి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నీటి ఎద్దడి లేకుండా చూడాలి



సమావేశంలో మాట్లాడుతున్న మేయర్ మహేందర్‌గౌడ్

బండ్లగూడ: వేసవిలో ప్రజలకు నీటి ఎద్దడి లేకుండా చూడాల్సిన బాధ్యత జలమండలి అధికారులపై ఉందని బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ బుర్ర మహేందర్‌గౌడ్ అన్నారు. హిమాయత్‌సాగర్‌లోని కార్పొరేషన్ కార్యాలయంలో జలమండలి అధికారులతో సోమవారం సమీక్షా సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ ఆదేశాల మేరకు ప్రజలకు ఇబ్బందులేకుండా చూస్తున్నామన్నారు. వేసవి ప్రారంభం కాకముందే కొన్ని కాలనీలకు ఆరు రోజులుగా నీటి సరఫరా కావడం లేదని తనకు ఫిర్యాదులు అందాయన్నారు. కొత్తగా నిర్మించిన రిజర్వాయర్ల నుంచి వెంటనే నీటిని అందించాలని సూచించారు. అలసత్వం చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. అలాగే 2011 సంవత్సరానికి ముందు మంచినీటి కనెక్షన్ ఉండి క్యాన్ నంబర్ లేనివాళ్లు జలమండలి మేనేజర్‌కు అఫిడవిట్ సమర్పించి క్యాన్ నంబర్ పొందాలని ప్రజలకు సూచించారు. కార్యక్రమంలో కార్పొరేషన్ కమిషనర్ బి.శరత్‌చంద్ర, కార్పొరేటర్ బుర్ర సాయిసాగర్‌గౌడ్, జలమండలి అధికారులు ప్రశాంత్, గోకరి సురేశ్‌గౌడ్, పాపయ్యయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

కాంగ్రెస్ పార్టీ శేరిలింగంపల్లి ఇన్‌చార్జి జగదీశ్వర్‌గౌడ్



భవానీపురంలో పర్యటిస్తున్న జగదీశ్వర్ గౌడ్

హఫీజ్‌పేట్ : చందానగర్ డివిజన్ పరిధిలోని భవానీపురంలో నెలకొన్న సమస్యలను పరిష్కరిస్తానని కాంగ్రెస్ పార్టీ శేరిలింగంపల్లి ఇన్‌చార్జి జగదీశ్వర్‌గౌడ్ పేర్కొన్నారు. సోమవారం డివిజన్ పరిధిలోని భవానీపురంలో నెలకొన్న సమస్యలపై స్థానిక నాయకులతో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలనీలో నాలా, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ సమస్య తీవ్రంగా ఉందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అభివృద్ధే ధ్యేయంగా ముందుకు సాగుతుందన్నారు. శేరిలింగంపల్లి నియోజకవర్గంలో నెలకొన్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో పార్టీ నియోజకవర్గ కోఆర్డినేటర్ రఘునందన్‌రెడ్డి, మాజీ కౌన్సిలర్ సునీతారెడ్డి, నాయకులు ప్రభాకర్‌రెడ్డి, నల్ల సంజీవరెడ్డి, వీరేందర్‌గౌడ్, కాలనీవాసులు సుందర్, గౌస్, కృష్ణారెడ్డి, లక్ష్మీకాంత్‌రెడ్డి, పర్వతరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బొడ్రాయి ప్రతిష్ఠాపనోత్సవం



పూజల్లో పాల్గొన్న గచ్చిబౌలి కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి, స్థానికులు

రాయదుర్గం: గోపన్‌పల్లిలో నాభిశిల బొడ్రాయి ప్రతిష్ఠాపనోత్సవాన్ని సోమవారం నిర్వహించారు. ఆలయంలో అమ్మవారికి పూజ, అభిషేకాల అనంతరం బొడ్రాయికి పూజ చేశారు. గచ్చిబౌలి కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి, గోపన్‌పల్లి వాసులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ పూర్వం ప్రతి గ్రామంలో బొడ్రాయిని విధిగా ప్రతిష్ఠించే వారని గుర్తు చేశారు. ప్రస్తుతం పట్టణీకరణతో కొత్తకొత్త కాలనీలు ,బస్తీ లు ఏర్పడడంతో ఈ బొడ్రాయి సంస్కృతి కనుమరుగయిందన్నారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు పోచయ్య, రవీందర్‌ప్రసాద్ దూబే, చంద్రమౌళి, నర్సింహ, యాదయ్య, రాజు, రాజేందర్, అనిల్, మహిళలు పాల్గొన్నారు.